సాక్షి
బాపట్ల

శనివారం। 13। జనవరి। 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం శుక్రవారం 522.20 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088, జలవిద్యుత్ కేంద్రానికి 26,950 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గోదాదేవికి సారె సమర్పణ

పెదకూరపాడు: పెదకూరపాడులో రాజా వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం గోదాదేవి అమ్మవారికి, దేవతమూర్తులకు సారె సమర్పణ వైభవంగా నిర్వహించారు.

విజయకీలాద్రిపై ధనుర్మాస వేడుకలు



తాడేపల్లిరూరల్ : సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధనుర్మాస వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

గుంటూరు రేంజ్‌లో నలుగురికి ఉత్తమ పతకాలు

నగరంపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో పోలీస్ అధికారులు, సిబ్బందికి ఉత్తమ, సేవా పతకాలను ప్రకటిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఎంపిక చేసిన వారికి ఉగాది పండుగనాడు పతకాలను అందజేయనున్నారు. గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలలో నలుగురుకి ఉత్తమ, నాలుగు సేవా పతకాలు లభించాయి. ఇక సేవా పతకాలలో ఏఎస్‌ఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు గుంటూరు -4, బాపట్ల- 9, పల్నాడు- 3, ప్రకాశం -4, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలో ఐదుగురు అర్హత సాధించారు.

ఐలవరంలో శోభాయాత్ర



ఐలవరం(భట్టిప్రోలు): వివేకానంద విద్యా గ్రామీణాభివృద్ధి సంస్థ, (ఐలవరం) సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఐలవరంలో స్వామి వివేకానందుని జయంతి ఉత్సవాలు వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. పురవీధులలో వివేకానందునికి జై, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్ర చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు జంజనం హేమశంకర రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బండారు శ్రీనివాసరావు, జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, రేపల్లె ఖండ ప్రముఖ్ ద్రావ రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ అంటె వెంకటేశ్వర్లు, నిర్వాహకులు పడమట వెంకటేశ్వరరావు, వి.కోటేశ్వరరావు, కె.బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల కోసం కళాకారులు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ క్రీడా ప్రాంగణంలో ఈనెల 14వ తేదీ భోగి, 15న మకర సంక్రాంతి సందర్భంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలలో భాగంగా ఔత్సాహిక కళాకారులు నృత్యం, పాటలు, సంగీతం తదితర వాటిలో వారి వారి ప్రతిభను చూపేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.శామ్యూల్ 91827 17818, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు 80742 76942 నంబర్లను సంప్రదించాలని కోరారు.


విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

రూ. 6.20 లక్షలు అపరాధ రుసుం విధింపు



భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 70 బృందాలు గృహ, వాణిజ్య సర్వీసులను పరిశీలించారు. 5,588 సర్వీసులను తనిఖీ చేయగా వాటిలో 148 సర్వీసులు విద్యుత్ లోడు అధికంగా వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ. 6.20 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ విజిలెన్స్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (గుంటూరు) పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో రేపల్లె డీఈఈ నెమలికంటి భాస్కరరావు, భట్టిప్రోలు ఏఈఈ పెరవలి ఏడుకొండలు, తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు



పట్నంబజారు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు టికెట్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం చెప్పారు. కాంట్రాక్టు గ్యారేజీ బస్సులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నిబంధనలు ఉల్లంఘించిన 48 బస్సులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నమ్మకంగా చీటింగ్



షేక్ మస్తాన్‌వలి

రోజుకో కొత్త మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. కష్టపడి సంపాదించుకున్న డబ్బుల్ని కాజేస్తే ఆ బాధ వర్ణనాతీతం. ఇంతా జరుగుతున్నా కూడా ప్రజల్లో అవగాహన రాకపోవడం శోచనీయం. అలవలపాడు గ్రామంలో షేక్ మస్తాన్‌వలి బాగా నమ్మకం ఏర్పరుచుకున్నాడు. 10 ఏళ్లుగా చీటీ పాటలు కడుతూ, అవసరమైన వారికి డబ్బులు సాయం చేస్తూ అందరిలో కలిసి పోయాడు. రూ. 50 వేల చీటీ పాటల నుంచి రూ. 2 లక్షల చీటీ వరకు వేసేవాడు. అతన్ని నమ్మి గ్రామంలో చాలా మంది చీటీలు కట్టారు. బంగారం వ్యాపారం చేస్తున్నానంటూ నమ్మ బలికి లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. వారిలో కొంత మందికి 2,3 నెలల పాటు వడ్డీలు చెల్లించాడు. అది చూసి చాలా మంది అధిక డబ్బులు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీన్ని అనరాగా తీసుకొని నెల రోజుల నుంచి గ్రామంలో కనిపించకుండా వెళ్లిపోయాడు.

- అలా నమ్మించాడు.. ఇలా ఉడాయించాడు
- రూ.1 కోటి చీటీ పాట డబ్బులతో పరార్
- 160 మంది వరకు బాధితులు
- బంగారం కొనుగోలు పేరుతో బురిడీ
- కుటుంబ సభ్యులతో పరారైన షేక్ మస్తాన్‌వలి




చీటీ పాటలకు డబ్బులు ఇచ్చి మోసపోయిన ముస్లిం కాలనీవాసులు

జే.పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి గ్రామంలో చీటీ పాటలు నిర్వహిస్తుంటాడు. అతడ్ని నమ్మి 160 మంది వరకు నెలకు రూ. 10 వేలు చొప్పున చీటీ కట్టారు. అందరూ ముస్లిం కాలనీకి చెందిన వారు. చీటీ పాటలు కట్టిన వారంతా కూలీనాలీ చేసుకునే వారే. చీటీ కట్టేవారిలో కొందరు పిల్లల చదువు కోసం, కొందరు కూతురు పెళ్లి నిమిత్తం కట్టినవారు ఉన్నారు. ఇలా ఎంతోమంది కష్టపడి డబ్బులు కట్టుకున్నారు. వారిలో అతి కొద్ది మందికి మాత్రమే తిరిగి అందాయి. ఎనిమిది చీటీ పాటల్లోనూ కొందరికి మాత్రమే డబ్బులు చెల్లించాడు. తప్పుడు చీటీ పాటలు చూపి డబ్బులు మొత్తం అతనే వాడుకున్నాడని బాధితులు వాపోతున్నారు.

రూ. 50 లక్షలు వరకు అప్పులు

చీటీ పాటలే కాక గ్రామంలో కొంత మందికి దొంగ బంగారం కొంటున్నానని షేక్ మస్తాన్‌వలి నమ్మబలికించి రూ. 50 లక్షలు వరకు అప్పులు చేశాడు. వారిలో కొంత మందికి నెలనెలావడ్డీ డబ్బులు చెల్లించాడు. అలవలపాడు గ్రామంలో గతంలో కొంత మంది దొంగ బంగారం వ్యాపారం చేసి కోట్లాది రూపాయలు గడించారన్న నానుడి ఉంది. బొంబాయి నుంచి బంగారం కొంటున్నానని, డబ్బులు తగ్గాయని గ్రామంలో ఉన్న కొంత మంది వద్ద అప్పులు చేశాడు. మరికొంత మంది అతడ్ని నమ్మి డబ్బులు ఇచ్చారు. కొంత మంది ఇల్లు, పొలం తనఖా పెట్టి లక్షలు లక్షలు తెచ్చి షేక్ మస్తాన్‌వలి చేతిలో పోశారు. గ్రామానికి చెందిన దోలా గోవిందమ్మ అనే వృద్ధురాలు రూ. 13 లక్షలు తెచ్చి ఇచ్చింది. వాటిలో రూ.8 లక్షలు బ్యాంకు నుంచి లోను తీసుకోగా, ఇల్లు కట్టుకోవాలని రూ.5 లక్షలు దాచుకుంది. మొత్తం తెచ్చి మస్తాన్‌వలి చేతిలో పెట్టింది. పారిపోయాడన్న విషయం తెలుసుకున్న గోవిందమ్మ భోరున విలపించింది. ఇలా మస్తాన్‌వలి మోసాలకు బలైన వారు ఎందరో ఉన్నారు.



PROMISSORY NOTE

షేక్ మస్తాన్‌వలి రాసిన నోటు

నమ్మి రూ. 6 లక్షలు ఇచ్చా



మా కాలనీలో అంతా షేక్ మస్తాన్‌వలిని పూర్తిగా నమ్మాం. అందరితో పాటు నేను నమ్మి అతని వద్ద రూ. 2 లక్షల చీటి పాటలు రెండు వేశా. రెండు పాటలు చివరికి వచ్చాయి. అదీ కాక బంగారం కొంటానని చెప్తే మరో రూ. 6 లక్షలు ఇచ్చా. వాటికి సంబంధించి నాకు మూడు నెలలు పాటు వడ్డీ చెల్లించాడు. అది చూసి కొంత మంది అతనికి డబ్బులు ఇచ్చారు. నాకు రెండు నెలల నుంచి వడ్డీ డబ్బులు ఇవ్వడం లేదు.

–షేక్ నన్నేసా, బాధితుడు


రూ. 5.50 లక్షల చీటీ పాటలు కట్టా



షేక్ మస్తాన్ వలి గ్రామంలో బాగా నమ్మకం ఏర్పచుకున్నాడు. గత 10 సంవత్సరాల నుంచి చీటీలు వేస్తున్నాడు. అది నమ్మి మేము కొంతమంది కలిసి లక్షలాది రూపాయలు కట్టాం. నేను మూడు పాటలకుగాను ఇప్పటికి రూ. 5.50 లక్షలు చెల్లించాను. పాటలు చివరికి వచ్చాయి. గత నెల 20వ తేదీన డబ్బులు ఇస్తాన్నాడు. చివరికి గ్రామంలోనే లేకుండా పరారయ్యాడు.

–షేక్ సైదా, బాధితుడు

రూ. 9.50 లక్షలు మోసపోయా



మస్తాన్ వలిని నమ్మి ఎలాంటి నోటు లేకుండా నోటి మాట మీద గత నెల 5న రూ. 9.50 లక్షలు ఇచ్చాను. నేను డబ్బులు ఇచ్చిన తరువాత రెండు రోజులకు గ్రామం వదిలి కుటుంబ సభ్యులతో వెళ్లిపోయాడు. ఫోన్ చేస్తే ఫోన్ కలవలేదు. దానితో పాటు రూ. 1.50 లక్షల చీటీ పాట డబ్బులు కట్టా. అవి కూడా నాకు ఇవ్వలేదు.

– షేక్ దస్తగిరి, అలవలపాడు, బాధితుడు

ఆర్బీకేలతో రైతులకు మరిన్ని సేవలు

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- రూ.5.55 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



వేటపాలెం: గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు చేరువగా అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలో రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్రాభివృద్ధిలో రాజీపడడం లేదని తెలిపారు. అన్ని గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేల ఏర్పాటు చేసి పాలను ప్రజల చెంతకు తెచ్చారని చెప్పారు. ఆర్బీకే ఉద్యోగులు కూడా రైతులకు సేవలు సత్వరమే అందించాలని సూచించారు. గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాలను వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం నేడు ఆపరిస్థితి లేదని ఎమ్మెల్యే అన్నారు. ముందుగా గ్రామంలో రూ. 5.55 కోట్లతో చేసిన వివిధ అభివృద్ధి పనుల్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ శేషయ్య, ఎంపీడీవో కె. నేతాజీ, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దు సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ జంగిలి రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పులి వెంకటేశ్వర్లు, యువత అధ్యక్షుడు ఆవుల అశోక్, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, నేతలు కర్రా వెంకటేశ్వర్లు, విజయ్, పులి హరికృష్ణ, జిడుగు మస్తాన్, పిట్టు పోలయ్య, ఆవుల కొండలు, షేక్ హాలీ, గుదిని వెంకటరావు బొంతగొర్ల కోటేశ్వర రావు, గుదిని నాగరాజు, గుదిని గోపి, గొల్లపోలు శ్రీరామ్మూర్తి, కాటూరి నాగయ్య ఏపీఎం శ్రీనివాసులు, ఏవో కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

ఇంటింటా సంక్రాంతి సిరులు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- కలెక్టరేట్‌లో సందడిగా సంక్రాంతి సంబరాలు
- ఉత్సాహంగా పాల్గొన్న సిబ్బంది



భోగి మంటలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, వికసిత్ ప్రత్యేక అధికారి రాహుల్, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత

బాపట్ల: సంక్రాంతి పండుగతో ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆకాంక్షించారు. కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. రోకలి పోట్లు, తిరగలి చప్పుళ్లు, గొబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దుల ప్రదర్శన, డప్పు కళాకారుల నృత్యాలు, వాయిద్యకారుల మేళ తాళాలతో కలెక్టరేట్ ప్రాంగణం మార్మోగింది. ఉత్సాహభరితంగా అధికారులు, ఉద్యోగులంతా వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా అధికారుల సైతం సంబరాలలో నృత్యాలు చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, వికసిత్ భారత్ జిల్లా ప్రత్యేక అధికారి రాహుల్ మాలిక్, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, ఆయన సతీమణి రమాదేవి సంప్రదాయబద్ధంగా జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సంప్రదాయ వస్త్రధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కలెక్టర్ చాంబర్ నుంచి అతిథులకు కుంభమేళా, వేద పండితుల మంత్రోచ్చారణతో అధికారులు ఘనంగా ఆహ్వానం పలికారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై వారిని ఊరేగింపుగా ప్రాంగణం వద్దకు తెచ్చారు. పొంగళ్లు పెట్టి అందరికీ వడ్డించారు. చేతికి అందివచ్చిన కొత్త ధాన్యాన్ని రోళ్లలో వేసి అధికారులు దంచారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. టగ్గాఫ్ వార్‌లో జిల్లా కలెక్టర్, వికసిత్ భారత్ ప్రత్యేక అధికారి ఒక జట్టులో, బాపట్ల శాసనసభ్యులు మరో జట్టులో తలపడ్డారు. జిల్లా కలెక్టర్ టీం విజేతగా నిలిచింది. జిల్లా అధికారులు ఆసక్తిగా పాల్గొని అందరిలో ఉత్సాహాన్ని నింపారు. గాలిపటాలు ఎగరవేశారు. అనంతరం ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

ఏటా సంబరాల నిర్వహణ

సంక్రాంతి సంబరాల్ని ప్రభుత్వం ఏటా అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రతి ఇంటిలోకి ఆనందాన్ని తేవాలని ఆకాంక్షించారు. సూర్యుడు మకర రేఖలోకి వెళ్తున్న తరుణంలో మకర సంక్రాంతిగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు జరుపుకుంటారని, ఇతర రాష్ట్రాలలోనూ పండగ ఎంతో వైభవంగా జరుగుతుందని వివరించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. ఇటీవల తుఫానుతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం కచ్చితంగా సహాయం అందిస్తుందని పేర్కొన్నారు.

సంతోషాన్ని ఇచ్చింది

సంక్రాంతి పండుగ వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వికసిత్ భారత్ జిల్లా ప్రత్యేక అధికారి రాహుల్ మాలిక్ చెప్పారు. అందరూ కలిసి ఇలా పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

ప్రజలంతా సంతోషంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్లాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్. శ్రీధర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రైతులు క్షేమంగా ఉంటే ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత అన్నారు. సంక్రాంతి పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రజల్లో మరింత ఆనందాన్ని నింపాలని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ ఏవో కె. గోపీకృష్ణ, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అట్టడుగు ప్రజలకు 'సంక్షేమం' చేరువ

అధికారులకు వికసిత భారత్ ప్రత్యేక అధికారి రాహుల్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ మాలిక్

బాపట్ల: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని అట్టడుగు ప్రజలకు అందించడానికి చర్యలు తీసుకోవాలని వికసిత భారత్ ప్రత్యేక అధికారి రాహుల్ మాలిక్ అధికారుల్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన మీటింగ్ హాలులో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాలిక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈనెల 26 తేదీలోగా నూరు శాతం ప్రజలకు లబ్ధి చేకూర్చాలని చెప్పారు. అనంతరం 2024–25 లింకేజ్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ సీహెచ్. శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గార్డ్ రూములను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: సిబ్బంది సంక్షేమమే ధ్యేయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. తన క్యాంప్ కార్యాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గార్డ్ రూముల్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, వారికి సౌకర్యాల్ని కల్పించినప్పుడే ప్రజలకు మెరుగైన సేవల్ని అందించగలుగుతారని తెలిపారు. పోలీస్ క్యాంప్ కార్యాలయంలో గార్డ్ డ్యూటీ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటారన్నారు. వారి సమస్యను దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలతో గార్డు రూముల్ని నిర్మించినట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా టీ-20 క్రికెట్ టోర్నీ

నాలుగో రోజు విజేతలు కేరళ, తెలంగాణ

జే.పంగులూరు: మండలంలోని కొండమంజులూరులో పానెం హనిమిరెడ్డీస్ జాతీయ స్థాయి టీ-20 క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. కొండమంజులూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో ఐపీఎల్, రంజీ ప్లేయర్లు ప్రతిభ కనబరుస్తున్నారు. నాలుగో రోజు శుక్రవారం తెలంగాణ, కేరళ జట్లు విజేతలుగా నిలిచాయి.

మ్యాచ్‌ల వివరాలు

- ఉదయం ప్రతిభా సీసీ (కేరళ), గుజరాత్ లయన్స్ (గుజరాత్) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన గుజరాత్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో బాటింగ్ చేసిన కేరళ జట్టు 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుజరాత్ 18.5 ఓవర్లలో ఆలౌట్ అయ్యి 127 పరుగులు మాత్రమే చేసింది. 46 పరుగులు తేడాతో కేరళ జట్టు విజయం సాధించింది. కేరళ జట్టుకు చెందిన సుధన్ 48 బంతుల్లో 70 పరుగులు చేశాడు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.
- మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో సిరి హాస్పిటల్ (ఆంధ్రప్రదేశ్), లెవన్ బ్రదర్స్ (తెలంగాణ) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన సిరి హాస్పిటల్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన తెలంగాణ జట్టు 17.5 ఓవర్లలో ఆలౌట్ అయ్యి 139 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సిరి హాస్పిటల్ జట్టు 17.5 ఓవర్లలో 113 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. మ్యాచ్‌లో తెలంగాణ జట్టుకు చెందిన జీవానంద్ ప్రతిభను కనబరిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కి ఎంపికయ్యాడు.



సిరి హాస్పిటల్, తెలంగాణ జట్ల మధ్య మ్యాచ్

నేటి మ్యాచ్ వివరాలు

చిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం), తమిళనాడు జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. మధ్యాహ్నం ఎంఆర్‌సీసీ (చెన్నై), మెగా లెవన్ (విజయవాడ) జట్లు మధ్య మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

మోపెడ్ నుంచి పడి వ్యక్తి మృతి


గుంజి వీరయ్య

మేదరమెట్ల: మోపెడ్‌పై వెళ్తున్న కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల దక్షిణ బైపాస్ సమీపంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఇంకొల్లు మండలం పావులూరు గ్రామానికి చెందిన గుంజి వీరయ్య (78) ఎండు మిర్చి విక్రయిస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. తెల్లవారు జామున మోపెడ్‌పై మిరపకాయలు తీసుకొని మేదరమెట్ల జాతీయ రహదారిపై నుంచి మద్దిపాడు వైపు వెళ్తుండగా.. ఏమైందో తెలియదు కాని, రోడ్డుపై పడి మృతి చెందాడు. సమాచారం మేరకు.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వీరయ్య మృతదేహాన్ని పరిశీలించారు. మోపెడ్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని, మృతుడికి కూడా ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. మృతుడి వద్ద ఉన్న ఫోన్ ఆధారంగా అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పి.నాగశివారెడ్డి తెలిపారు.

రంగస్థలంతో సామాజిక చైతన్యం

ఆకట్టుకుంటున్న నాటక పోటీలు

యద్దనపూడి: సమాజంలోని వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు అవలోకనం చేసుకుంటూ ప్రజల కష్టాలను, కడగండ్లను ప్రేక్షకుల దృష్టికి తీసుకువచ్చే నాటకం మానవ జీవితానికి దర్పణం వంటిదని నటుడు, రచయిత, దర్శకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీల్లో ముఖ్య అతిథులుగా అసిస్ట్ డైరెక్టర్ జాష్టి రంగారావు, నాటకరంగ విశ్లేషకులు అంబటి మురళీకృష్ణ, వేదిక నాటక పరిషత్ సమ్మేళన అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు, నటులు, దర్శకుడు మల్లాది శివన్నారాయణ పాల్గొన్నారు. రెండో రోజు ప్రదర్శించిన నాటకోత్సవాలు ప్రేక్షకులకు ఒక అద్భుత రసానుభూతిని పంచాయి. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు గుదే పాండు రంగారావు, మద్దినేని జయరామకృష్ణ, పోపూరి హనుమంతురావు, శివసుబ్బారావు, కొరటాల వంశీకృష్ణ, పెదవల్లి వెంకటేశ్వర్లు, ఆచంట సుబ్బారావు పాల్గొన్నారు.

నవరసభరితంగా నాటికలు

● మిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారు ప్రదర్శించిన 'కన్నీటి కథ' నాటికలో.. కొందరికి గాలి, నీరు, నేల కొనదగిన, అమ్మదగిన వస్తువులా కనిపిస్తాయి. కార్పొరేట్ వ్యవస్థలో చివరికి పీల్చే గాలి సైతం వ్యాపారంగా మార్చారు. ఒకానొక గ్రామంలో బహుళజాతి కంపెనీ పెట్టడం వల్ల అక్కడి రైతులు సాగునీటిని, తాగునీటిని కోల్పోయి అప్పులపాలైయ్యారు. బోరువేసినా చుక్క నీరు కూడా లేదు, ఆ రైతుల చుట్టూ ఉన్న జీవితాల గాథే ఈ కన్నీటి కథ సారాంశం.

● కళాంజలి హైదరాబాద్ వారు ప్రదర్శించిన 'రైతే రాజు' నాటికలో నేటి ఆధునిక యుగంలో మనిషి తన చేతిలోని ఫోన్‌తోనే ప్రపంచాన్ని శాసించే ఈ రోజుల్లో ఫోన్ లేకుండా ఉండగలరు కాని, పిడికెడంత అన్నం లేకపోతే ఉండలేమనే విషయాన్ని గ్రహించలేక పోతున్నారు. రైతులంతా కలిసి వారికి సరిపడినంత పంట మాత్రమే పండించుకొని పంటకు విశ్రాంతినివ్వకముందే పాలకులు, ప్రభుత్వాలు రైతు కష్టాలు తెలుసుకొని వారి ఆత్మహత్యలను నిలవరించకపోతే పట్టెడన్నం పెట్టేవారు కరువతారనేది రైతే రాజు నాటిక ఇతివృత్తాంతం.

● మూడో నాటికగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'జరుగుతున్న కథ' నాటికలో పిల్లల ఆర్థిక పరిపుష్టికి తమ అవసరాలను కూడా పక్కనపెట్టి వారిని ప్రయోజకులను చేసేందుకు శక్తియుక్తులన్నీ ధారపోస్తారు తల్లిదండ్రులు. చివరకు పిల్లల ఆదరాభిమానాలకు దూరమై అవమానాలకు గురైన తీరును కళ్లకు కట్టినట్టుగా చూపించారు. నాటికలను చూడటానికి ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.


నాటికలను ప్రారంభిస్తున్న మల్లాది శివన్నారాయణ, అంబటి మురళీకృష్ణ


రైతే రాజు నాటికలో ఓ సన్నివేశం

ఎస్వీఆర్ఎం కళాశాల అభివృద్ధికి కృషి

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు


ఎస్ఆర్కే ప్రసాద్ విగ్రహావిష్కరణలో ఎంపీ నామా నాగేశ్వరరావు

నగరం: తీర ప్రాంతంలో ఎంతో చరిత్ర కలిగిన శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం కళాశాల పాలకవర్గం మాజీ ఉపాధ్యక్షుడు ఎస్ఆర్కే ప్రసాద్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి ఎస్ఆర్కే ప్రసాద్ కృషి మరువలేనిదని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలకనుగుణంగా ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. తొలుత ఎస్ఆర్కే ప్రసాద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు, నామా నందిత ప్రసాద్, నామా పృథ్వీతేజ, నర్రా కృష్ణప్రసాద్, కరస్పాండెంట్ బుచ్చియ్య చౌదరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

NARASARAOPET MUNICIPALITY : NARASARAOPET

'e' - Procurement - Tender Notice

Tender Notice No.627/2023/E1, Dt.12-01-2024

1	Total No of Works	16 Nos. of works Nit.No.18A/2023-24 - (10th call) 32A/2023-24, 36A/ 2023-24 - (7th call), 37A/2023-24 to 39A/2023-24, 41A/2023-24, 42A/2023-24- (6th call) 43A/2023-24 and 45A/2023-24 - (5th call) 50A/2023-24, 52A/2023-24, 46A/2021-22 (4th call), 57A/2023-24 (3rd call), 64A/2023-24 and 65A/2023-24 - Short tender 1st call.	2 No's. of works 66A/2023-24 and 67A/2023-24 - 1st Call.
2	Total Estimate Value of Works	Rs.1,57,53,000/-	Rs.40,70,000/-
3	Bid document download starting date.	12-01-2024 11:00 PM	12-01-2024 11:00 PM
4	Bid document download end date.	20-01-2024 04:00 PM	30-01-2024 04:00 PM
5	Last Date & Time for receipt of Bids.	20-01-2024 05:00 PM	30-01-2024 05:00 PM
6	(Nit.No.18A/2023-24, 36A/2023-24, 37A/2023-24 to 39A/2023-24 and 41A/2023-24, 45A/2023-24, 46A/2021-22 and 50A/2023-24, 52A/2023-24 - (Municipal General Funds), 32A/2023-24, 42A/2023-24 - (APHCL Grant/Municipal General Funds), 43A/2023-24 - (MPLADS - 2022-23), 57A/2023-24 and 64A/2023-24 to 68A/2023-24 - (Municipal General Funds) and 67A/2023-24 - (MPLADS - 2023-24)		

Note: Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No separate press notification shall be issued. Further details can be seen @ e-Procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner, NARASARAOPET MUNICIPALITY, NARASARAOPET.

అత్యంత వైభవంగా కమలాత్మిక హోమం


ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోన రఘుపతి, సినీ రచయిత కోన వెంకట్

బాపట్ల అర్బన్: శ్రీ లలితా త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల విశేష పూజా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నుంచి బాపట్ల చీలురోడ్ వద్ద గల శ్రీ పాండురంగ స్వామి దేవాలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా కమలాత్మిక హోమం, శ్రీలక్ష్మీ పుష్పార్చన కార్యక్రమం జరిగింది. పీఠం నిర్వాహకులు నేమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో భారీగా విచ్చేసిన భక్తుల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్గశిర అమావాస్య మహాలక్ష్మీ స్వరూపమైన కమలాత్మికదేవి భూలోకంలో తామర పుష్పంలో జన్మించిన పర్వదినాన అమ్మవారికి ప్రీతికరమైన పుష్పాలను, కుంకుమతో అలంకరించి సుగంధ హోమ ద్రవ్యాలతో అర్చించటం ద్వారా అఖండ ధన సంపద, ఆయురారోగ్య సంప్రాప్తిస్తాయని హనుమంతరావు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోన రఘుపతి, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకులు మేడూరి వెంకట అప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, పరాశరం రఘురామ్, వంగులూరు కౌండిన్య, గూడూరు సాయివెంకట్ యాజ్ఞికం నిర్వహించారు. ఆలయధర్మకర్త మార్చూరి బదరీనారాయణ, భక్త సమాజం నిర్వాహకురాలు సీరాజా దేవి పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేసిన సినీ రచయిత కోన

కర్లపాలెం: పేదలకు చేయూతనందించేందుకు ఎమ్మెల్యే కోన రఘుపతి కుటుంబం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రముఖ సినీ రచయిత, నిర్మాత, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన వెంకట్ తెలిపారు. కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోన రఘుపతి పంపిన దుప్పట్లను శుక్రవారం కొత్త నందాయపాలెంలో పింఛనుదారులకు కోన వెంకట్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవటం ద్వారా ప్రజా రంజకమైన పరిపాలన అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, కో–ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, పెద పులుగువారి పాలెం సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆట్ల అయ్యప్పరెడ్డి, మందపాటి వరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, పీవీ సురేష్, తాజుద్దీన్, సత్యనారాయణరెడ్డి, డానియేల్, బెనర్జి, జానీ పాల్గొన్నారు.

రసవత్తరంగా దక్షిణ భారత టీ-20

హైదరాబాద్, తిరుపతి జట్ల విజయం


బెంగళూరు- హైదరాబాద్ మధ్య మ్యాచ్..


బౌలర్ ప్రకాష్‌రెడ్డి

మేదరమెట్ల: సంక్రాంతి పండగ పురస్కరించుకొని రావినూతల క్రికెట్ స్టేడియంలో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్–2024 పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లలో థండర్ బోల్ట్స్ (తిరుపతి), ప్రసాద్ జీ స్పోర్ట్స్ లెవెన్ (హైదరాబాద్) జట్లు విజయం సాధించాయి. ఉదయం థండర్ బోల్ట్స్, మెగా వారియర్స్ (విజయవాడ) జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ ఆరంభించిన మెగా వారియర్స్ 18.2 ఓవర్లకు 103 పరుగులు చేసి, ఆలౌట్ అయ్యింది. క్రికెటర్ ప్రశాంత్ 34 పరుగులు చేశాడు. తిరుపతి బౌలర్ ప్రకాష్‌రెడ్డి 11 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. మరో బౌలర్ డానియల్ 23 పరుగులు 3 వికెట్లు తీసి భారీ స్కోర్ చేయకుండా కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి కేవలం 9.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి విజయం సాధించింది.

● మధ్యాహ్నం ప్రసాద్ జీ స్పోర్ట్స్ (హైదరాబాద్)– లయన్స్ క్రికెట్ క్లబ్ (బెంగళూరు) జట్ల మధ్య మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగింది. మొదట బ్యాటింగ్ ఆరంభించిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. ఆదిత్యారెడ్డి 58 పరుగులు చేశాడు. 162 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన బెంగళూరు దూకుడుగా ఆడింది. చివరి ఓవర్‌లో 15 పరుగులు చేయాల్సి ఉండగా.. పది పరుగులు మాత్రమే చేసింది. దీంతో 5 పరుగుల తేడాతో హైదరాబాద్ విజయం సాధించింది. వ్యాఖ్యాతగా సాయిరాజ్, అంపైర్లుగా శ్రీనివాస్, వరప్రసాద్ వ్యవహరించారు.

నేటి మ్యాచ్‌ల వివరాలు..

ఉదయం శ్రీ సీసీ (చెన్నై)–వైట్ ఫీల్డ్ అకాడమీ (బెంగళూరు), మధ్యాహ్నం ఆర్‌వై సీసీ లెవెన్ (హైదరాబాద్)–జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్ల మధ్య శనివారం మ్యాచ్‌లు జరుగనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.

'దత్త గాన లహరి' సీడీ ఆవిష్కరణ


సీడీ ఆవిష్కరిస్తున్న రావినూతల కుటుంబ సభ్యులు

బాపట్ల అర్బన్: బాపట్ల శంకర విద్యాలయం వేదికగా రావినూతల శ్రీరామ్మూర్తి రచించిన 'దత్త గాన లహరి' పుస్తకం, సీడీ ఆవిష్కరణ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని దత్తాత్రేయ స్వామి సన్నిధిలో వారి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. నాటక, సాహిత్య రంగంలో రావినూతలకు విశేష గుర్తింపు ఉందని తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు జి.నాగ పూర్ణ రమాదేవి మాట్లాడుతూ దత్తాత్రేయ గీతాల్ని స్వరపరచడం సంతోషకరమన్నారు. వారి శిష్య బృందమే దత్త గీతాల్ని ఆలపించారని, స్థానిక వి.ఆర్. డిజిటల్ స్టూడియోలో ఆడియో, వీడియో రూపకల్పన జరిగిందని వెల్లడించారు. అనంతరం రావినూతల కుటుంబ సభ్యులు గాయకులు, కళాకారులను సత్కరించారు. కుటుంబ సభ్యులు ప్రకాష్, అన్నపూర్ణ, శేషసాయి ఆనంద్, కె. చంద్రశేఖర్, ఎ.ఎస్ చలపతిరావు, శిఖరం భుజగేంద్రమౌళి, వెంకు సవాతని, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.